క్లుప్తంగా

గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు



గర్భిణులకు స్కానింగ్ పరీక్ష చేస్తున్న వైద్యాధికారి విజయ్‌చంద్ర

బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లె పీహెచ్‌సీలో గర్భిణులకు అల్ట్రా సౌండ్ స్కానింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు వైద్యాధికారి విజయ్‌చంద్ర పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీలో ప్రతి బుధవారం స్కానింగ్ పరీక్షలు చేస్తామని, అత్యవసర సమయంలో అన్ని వేళలా స్కానింగ్ చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. లింగ నిర్ధారణ చట్టరీత్యానేరమన్నారు.

బాధిత కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండ



కృష్ణారెడ్డి కటుంబీకులను పరామర్శిస్తున్న పెద్దిరెడ్డి

సదుం: మండల కేంద్రంలోని మసీదు వీధికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త సయ్యద్‌బాషా ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అండగా నిలిచారు. వారు అందించిన ఆర్థిక సాయం రూ.లక్షను నాయకులు బుధవారం బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సయ్యద్ బాషా, పార్టీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు ప్రకాష్ రెడ్డి, మైనారిటీ నాయకులు ఖజాపీర్, అంజాద్, సైపుల్లా పాల్గొన్నారు.

కృష్ణారెడ్డి కుటుంబానికి పరామర్శ : మండలంలోని అమ్మగారిపల్లెకు చెందిన కృష్ణారెడ్డి ఇటీవల మృతిచెందారు. బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి పరామర్శించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, సింగిల్ విండో మాజీ వైస్ చైర్మన్ రమేష్‌రెడ్డి, పెద్ద సంఖ్యలో నేతలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



చిన్నేపల్లి పాఠశాలలో భోజనాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ

పెద్దపంజాణి: మండలంలోని చలమంగళం అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం ఎంపీడీఓ బాలాజి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో భాగంగా పిల్లలకు ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు. అంగన్‌వాడీ టీచర్లు సచివాలయ సిబ్బందితో సమన్వయం చేసుకుని పిల్లలకు పుట్టిన తేదీ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డులు జారీలో ఎలాంటి అలస్యం లేకుండా చూడాలన్నారు. అదే గ్రామ పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులను, చిన్నేపల్లి ఉర్దూ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. తర్వాత తుర్లపల్లి సచివాలయాన్ని తనిఖీ చేశారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఏపీఓ మురుగేషన్, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ముక్తార్ అహ్మద్, వీఆర్వో సుబ్రమణ్యం ఆచారి పాల్గొన్నారు.

25న మండల సమావేశం

పులిచెర్ల(కల్లూరు) : ఈనెల 25వ తేదీ ఉదయం 10.30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ సురేంద్ర నాథరెడ్డి, ఎంపీడీఓ రాజశేఖరబాబు తెలిపారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

వ్యాసరచన, క్విజ్ పోటీలు



వ్యాసరచన పోటీలకు హాజరైన విద్యార్థులు

చౌడేపల్లె : ఓటు హక్కు ప్రాముఖ్యతపై స్థానిక ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలను హెచ్‌ఎం నాగరాజరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ చూపిన వారికి ఈనెల 25న నిర్వహించే జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా బహుమతులు అందజేస్తారన్నారు.

బాలరాముడికి పూజలు



అన్నదానం చేస్తున్న నేతలు

పుంగనూరు: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ జరిగి ఏడాది కావస్తున్న సందర్భంగా పట్టణంలో బుధవారం బాలరాముడి చిత్రపటానికి పూజలు చేశారు. బీజేపీ ఆధ్వర్యంలో పట్టణంలోని గోకుల్ సర్కిల్‌లో బాలరాముడి చిత్రపటాన్ని ఉంచి పూజలు చేసి అన్నదానం చేశారు. హైందవ ధర్మాన్ని కాపాడుకోవాలని, ఐకమత్యంతో ఆలయాల అభివృద్ధికి కృషిచేయాలని కోరారు.

కానరాని పూత..

రైతు వ్యథ

ప్రతికూల వాతావరణం మామిడి రైతులకు శాపంగా మారింది. కొన్నేళ్లుగా వివిధ కారణాలతో నష్టపోతున్న మామిడి రైతులు ప్రస్తుతం ఇంకా పూత రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఈసారి నష్టం తప్పదేమోనని భయపడుతున్నారు. ఉపాధిలో మామిడి తోటల పెంపకానికి ప్రోత్సాహకాలు లభిస్తుండడంతో వాటి విస్తీర్ణం ఏటా పెరుగుతోంది. నియోజకవర్గంలో 30 వేల హెక్టార్లలో మామిడి సాగవుతోంది.

- మామిడి రైతుల భయాందోళన
- ఎండ కాస్తేనే పూతంటున్న నిపుణులు
- మందులకే వేల రూపాయల ఖర్చు



సదుం : మామిడితోటలో కానరాని పూత

సదుం : ఏటా నియోజకవర్గం నుంచి 30 లక్షల మెట్రిక్ టన్నుల మామిడి దిగుబడులు రావాల్సి ఉంది. వీటిని అధిక భాగం మామిడి మార్కెట్‌కు తరలిస్తుండగా.. పలువురు పల్ప్ ఫ్యాక్టరీలకు విక్రయిస్తారు. కరోనా సమయం నుంచి మామిడి రైతులకు నష్టాలు తప్పడం లేదు. గతేడాది పూత బాగానే ఉన్నా మంచు కారణంగా దిగుబడి పడిపోయింది. సాధారణంగా ఇక్కడి ప్రాంతాల్లో డిసెంబర్ మాసానికి పూత ప్రారంభమై ఉగాది నాటికి పిందెలు వస్తాయి. కానీ ఇప్పటికీ రాకపోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు.

కనిపించని పూత

వర్షాల సీజన్ ముగిసి పూతతో కళకళలాడాల్సిన తోటల్లో ఇంకా మొగ్గ వస్తున్న లక్షణాలు సైతం కనిపించడం లేదు. పూత కోసం వేల రూపాయలు వ్యయం చేసి మందులు పిచికారీ చేస్తున్నారు. కానీ మళ్లీ అడపాదడపా కురుస్తున్న వర్షాలు, దట్టమైన పొగ మంచు వారి ఆశలపై నీళ్లు చల్లుతున్నాయి. తోటలో పూతలు రాకపోవడానికి కారణం గతేడాది నవంబర్, డిసెంబర్ నెలలో కురిసిన అకాల వర్షాలే పూత రాక్పోవడానికి కారణమని రైతులు చెబుతున్నారు. వీటి కారణంగా తోటల్లో తేమ శాతం పెరగడంతో పాటు, పొగ మంచుతో పూత రావడం లేదని వాపోతున్నారు.

మామిడి సాగు వివరాలు (ఎకరాల్లో)	
చౌడేపల్లె	2,500
సోమల	5,000
సదుం	5,500
పులిచెర్ల	12,000
రొంపిచెర్ల	5,200

ఎండపైనే ఆశలు

ఇకనైనా ఎండ కాస్తే పూత వచ్చే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా వి.కోట, కుప్పం తదితర ప్రాంతాల్లో కాస్త ఆలస్యంగా జనవరి తరువాతే పూత ప్రారంభం అవుతుందని.. ఆ సమయానికి వాతావరణం అనుకూలిస్తే ఇక్కడ ప్రాంతాల్లోనే పూత బాగా వస్తుందని తెలుపుతున్నారు. ఆగస్టు మాసానికి మామిడి కాయ నిలబడుతుందని చెబుతున్నారు.

మందులకు రూ. 20 వేలు ఖర్చు చేశా..



మామిడి తోటలో పూత రాకపోవడంతో ఇప్పటి వరకు రూ. 20 వేలు మందుల పిచికారీకి ఖర్చు చేశా. కానీ పూత 10 శాతం కూడా రాలేదు. వాతావరణం కారణంగానే పూత ఆలస్యం అవుతోందని అధికారులు తెలిపారు. కొన్నేళ్లుగా మామిడి రైతులకు నష్టాలు తప్పడం లేదు.

– హరినాథరెడ్డి, కంభంవారిపల్లె క్రాస్, సదుం

మందులు పిచికారీ చేయాలి



వాతావరణం అనుకూలించక పోవడంతోనే పూత ఆలస్యమవుతోంది. పూత రావడానికి మోనో క్రోటో ఫోస్ 2 మి.లీ, బోరాన్ 2 గ్రాములు, 13.0.45 ను 10 గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఎండ కాస్తే వారం నుంచి పది రోజుల్లోపు పూత వచ్చే అవకాశం ఉంది.

– సంతోషికుమారి, ఉద్యానవన శాఖాధికారిణి, సదుం

పాఠశాలల్లో తనిఖీలు

పుంగనూరు : పలు పాఠశాలలను ఎస్ఎస్ఏ స్టేట్ రిసోర్స్ పర్సన్ బుజ్జి , డీఆర్పీ కిరణ్‌కుమార్ పలు పాఠశాలలను బుధవారం తనిఖీ చేశారు. పట్టణంలోని కొత్తయిండ్లు మున్సిపల్ హైస్కూల్, నక్కబండలోని కేజీబీవీ, అడవినాథునికుంటలోని మోడల్ స్కూల్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. పాఠశాలల్లో రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు ఎదురవుతున్న సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సంబంధిత హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు



గాయపడిన లక్ష్మమ్మ

పుంగనూరు : మండలంలోని భీమగాని పల్లె సమీపంలో రోడ్డుపై నడిచివెళ్తున్న లక్ష్మమ్మ(60)ను ఐచర్ లారీ ఢీకొన్న ఘటన బుధవారం చోటుచేసుకుంది. గమనించిన స్థానికులు తీవ్రంగా గాయపడిన లక్ష్మమ్మను స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆమె ప్రస్తుతం చికిత్స పొందుతోంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న చైర్మన్

పలమనేరు: విద్యుత్ అదాలత్‌లో వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని స్పెషల్ అదాలత్ చైర్మన్ రిటైర్డ్ జడ్జి శ్రీనివాస ఆంజనేయమూర్తి ఆదేశించారు. ఆమేరకు పట్టణంలోని ట్రాన్స్‌కో ఏడీ కార్యాలయం వద్ద బుధవారం ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పదిమంది రైతులు తమ సమస్యలను అర్జీల రూపంలో చైర్మన్‌కు అందజేశారు. వీటిని పరిశీలించిన ఆయన వీటిని ఆయా ఏఈలు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అదాలత్ కమిటీ సభ్యులు రామ్మోహన్‌రావు, అంజనీకుమార్, ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్, పుంగనూరు డీఈ శ్రీనివాసమూర్తి, ఏడీ చిన్నబ్బ పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి



నియామక పత్రం అందజేస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి

పుంగనూరు : వైఎస్సార్‌సీపీ గత పరిపాలన, సంక్షేమ పథకాల గురించి ప్రజల్లోకి తీసుకెళ్లి , కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాష్ట్ర మున్సిపల్ విభాగ అధికార ప్రతినిధిగా నియమితులైన కిజర్‌ఖాన్‌కు పెద్దిరెడ్డి నియామక పత్రాలు అందజేశారు. తెలుగుదేశం ప్రభుత్వం చేపట్టిన సూపర్-6 మోసాలపై ప్రజా ఉద్యమాలు చేపట్టాలని ఆదేశించారు. పదవులు పెట్టుకోవడం కాకుండా పార్టీ కోసం కష్టపడి పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు జయరాం, పార్టీ నేతలు నవీన్, అస్లాం మురాధి, ఆయాజ్, నూర్ పాల్గొన్నారు.

సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి



గోపూజను ప్రారంభిస్తున్న వెంకటేగౌడ

వి.కోట: తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలకు సంక్రాంతి పండుగ ప్రతీకగా నిలుస్తుందని మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. బుధవారం తోట కనుమ గ్రామంలో సంక్రాంతి పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమ సొంత గ్రామమైన తోటకనుమలో ఆయన సంక్రాంతి సంబరాల్లో పాల్గొని పండుగను ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటేగౌడ గోవులకు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు, యువతతో కలిసి సంబరాల్లో పాల్గొని సందడి చేశారు. ఎస్వీజీ ఫౌండేషన్ సభ్యులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు మామిడి రైతులకు అవగాహన

పలమనేరు: మామిడి పూతపై సస్యరక్షణ, పూత దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మామిడి రైతులకు సైంటిస్టులతో అవగాహన కార్యక్రమాన్ని స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం నిర్వహించనున్నట్టు స్థానిక హార్టికల్చర్ ఆఫీసర్ లక్ష్మీప్రసూన బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాన్ని మామిడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని అందులో కోరారు.

ఆ బస్సులు నడపండి సారూ!

- డయల్ యువర్ డీఎంలో వినతులు



దాసార్లపల్లి బస్సు(ఫైల్)

పలమనేరు: పది గ్రామాల ప్రజలు ఎర్రబస్సు కోసం పదేళ్లుగా ఆర్టీసీ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. వారు పట్టించుకోకపోవడంతో ఆర్టీసీ ఉన్నతాధికారులకు వినతులు పంపారు. అంతేకాదు స్థానికంగా ఏ పార్టీ ఎమ్మెల్యేలున్నా తమ సమస్యను పరిష్కరించాలంటూ దశాబ్దకాలంగా వేడుకుంటూనే ఉన్నా ఎవరూ కనికరించలేదు. ఇప్పటికైనా ఆ మూడు సర్వీసులను కొనసాగించాలి దేవరా అంటూ బుధవారం జరిగిన డయల్ యువర్ డీఎం కార్యక్రమంలోనూ పలు గ్రామాల ప్రజలు విన్నవించారు.

దాసార్లపల్లి బస్సు అక్కడో బ్రాండ్

పలమనేరు డిపో ప్రారంభమైనప్పటి నుంచి పలమనేరు నుంచి బైరెడ్డిపల్లి, తీర్థం మీదుగా దాసార్లపల్లి పది ట్రిప్పులు తిరిగేది. దీంతో ఈ ప్రాంతంలోని పది గ్రామాల ప్రజలకు సౌకర్యంగా ఉండేది. దాసార్లపల్లి గ్రామం కర్ణాటక రాష్ట్ర సరిహద్దుగా ఓ అడుగు పక్కన పెడితే కర్ణాటకలోని బైప్పల్లి వస్తుంది. రాష్ట్ర సరిహద్దులోని ఈ గ్రామానికి బస్సు గతంలో నడిచేది. కొన్నేళ్ల క్రితం ప్రయాణికులు తగ్గారనే సాకుతో ఈపీకే (ఎర్నింగ్ పర్ కిలోమీటర్ ఈ సర్వీసును ఆపేశారు. ఆపై గ్రామస్తుల నిరసనల నడుమ కొన్నాళ్లు పొద్దున, రాత్రిలో ఈ రూట్‌లో ఆఖరి సర్వీసుగా నడిపారు. పలమనేరు పట్టణంలో పలు రకాల పనులు చేసుకొని గ్రామాలకు వెళ్లే వారికి దాసార్లపల్లి ఆఖరి సర్వీసు అయినందను రాత్రుల్లో ఎంతో సౌకర్యంగా ఉండేది. ఆపై దీన్ని సైతం ఆర్టీసీ అధికారులు ఆపేశారు.

ప్రస్తుతం బైరెడ్డిపల్లి నుంచి దాసార్లపల్లికి మంచి తారురోడ్డున్నా బస్సు మాత్రం లేదు. గతంలో ఉన్న ఓ ప్రైవేటు బస్సు ఇప్పుడు లేదు. దీంతో ఆటోలు మినహా ప్రయాణానికి దిక్కు లేకుండా పోయింది.


వెంగవారిపల్లి- కోలారు సర్వీసు

పలమనేరు డిపోకు చెందిన బస్సు బైరెడ్డిపల్లి నుంచి ఉదయం బయలుదేరి కర్ణాటక రాష్ట్రంలోని కోలారుకు 9 గంటలకు చేరుకునేది. ఈ సర్వీసున్నప్పుడు ఆ మండలంలో పట్టుగూళ్లు పండించే రైతులు ఈ బస్సు ద్వారా కర్ణాటకలోని కోలారుకు గూళ్లను వేసుకుపోయేందుకు సౌకర్యంగా ఉండేది. దీంతోపాటు తీర్థం, దాసార్లపల్లి మీదుగా అంతర్రాష్ట్ర సర్వీసుగా ప్రజలకు సౌకర్యంగా ఉండేది. దీన్ని కూడా పదేళ్ల క్రితం ఆర్టీసీ అధికారులు ఆపేశారు.

తీర్థం మీదుగా బెంగళూరుకు

పలమనేరు నుంచి వయా బైరెడ్డిపల్లి, తీర్థం, గడ్దూరు, దాసార్లపల్లి, ముళబాగల్, కోలారు మీదుగా బెంగళూరుకు బస్సును నడపాలని ఆ ప్రాంత వాసులు ఎన్నో ఏళ్లుగా కోరుతున్నారు. గతంలో నడుపుతున్న రెండు సర్వీసులతోపాటు కొత్తగా బెంగళూరు సర్వీసును నడపాలని డీఎంకు పలువురు విన్నవించారు. దీనిపై ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించాల్సి ఉంది.


ఇది మా పదేళ్ల కల



బైరెడ్డిపల్లి నుంచి కర్ణాటక రాష్ట్రానికి వెళ్లే మార్గంలో తీర్థం గ్రామముంది. మంచి తారురోడ్డు సౌకర్యం ఉన్నా బస్సులేదు. దీంతో ఆటోలు, బైక్‌లపై మా చుట్టు పక్కల గ్రామాలకు వెళ్లాలి. ముఖ్యంగా సీనియర్ సిటిజన్‌లైన మాకు బస్సు సౌకర్యం లేక చాలా ఇబ్బందులు పడుతున్నాం. గత పదేళ్లుగా మా గ్రామానికి బస్సుకోసం విన్నవిస్తూనే ఉన్నాం. తాజాగా బుధవారం కూడా డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో చెప్పాం

తీర్థం క్రిష్ణమూర్తి, మాజీ సర్పంచ్, తీర్థం

కొత్త బస్సులు రాగానే పరిశీలిస్తాం..



ఎన్నో ఏళ్లుగా ఈ సమస్య ఉన్న మాట నిజమే. డయల్ యువర్ డీఎంలోనూ తీర్థం తోపాటు చట్టుపక్కల గ్రామస్థులు కాల్ చేసి సమస్యను తెలిపారు. దీనిపై ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కొత్త బస్సులు డిపోకు రావాల్సి ఉంది. అవి వచ్చాక ఈ మూడు సర్వీసులను ఎలా నడపాలనేది తప్పకుండా పరిశీలిస్తాం.

టీకే స్వామి, డిపో మేనేజర్, పలమనేరు

• నివాళి



నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్

వి.కోట: మండలంలోని ఓగు పంచాయతీ మట్టిగుట్టపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత నారాయణప్ప తల్లి సుబ్బమ్మ బుధవారం అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలిసి జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మృతురాలి నివాసానికి చేరుకుని ఆమె మృతదేహానికి నివాళులర్పించారు.

కనికరించండి సారూ!

- కుటుంబ పోషణకు కూలీగా మారిన విద్యార్థి
- ఆదుకోవాలంటున్న బాధితులు



మంచానికే పరిమితమైన హకీంబాషా

రొంపిచెర్ల: రొంపిచెర్ల పంచాయతీ స్థానిక మసీదు వీధికి చెందిన హకీంబాషా(48) పుట్టుకతో దివ్యాంగుడు. అయితే వెంటాడిన దురదృష్టం బాత్‌రూంలో జారిపడి అతన్ని పూర్తిగా మంచానికే పరిమితం చేసింది. ప్రభుత్వం నుంచి హకీంబాషాకు అందే దివ్యాంగుల రూ.15 వేల పింఛన్ అందక కుటుంబం గడవక అగచాట్లు పడుతోంది. కుటుంబానికి ఆసరాగా ఉన్న ఆ దివ్యాంగుడు పూర్తిగా మంచానికే పరిమితం కావడంతో కుటుంబం జరగక్క.. ఎలాంటి దిక్కులేక .. ఆదుకునే తోడులేక ఇంటర్ చదువుతున్న కుమారుడు రియాజ్ బాషాను చదువు ఆపేసి కూలీ పనులకు పంపిస్తున్నారు. మరోవైపు హకీంబాషా భార్య కూలీ పనుల కెళ్తూ.. కూతురిని అతికష్టం మీద ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్నారు. రోజు రోజుకు కుటుంబ భారం మోయలేకపోతున్నారు. సదరం సర్టిఫికెట్‌లో డాక్టర్లు 88 శాతం వైకల్యం ఉన్నట్లు హకీంకు సర్టిఫికెట్ మంజూరు చేశారు. దివ్యాంగులకు అందించే రూ.15 వేల పింఛన్ అందిస్తే కుమారుడిని చదివించుకుంటామని తల్లి జమీల కన్నీటి పర్యంతమవుతోంది. అధికారులు స్పందించి దివ్యాంగుడైన హకీంబాషాకు పింఛన్ మంజూరుచేయాలని కోరుతున్నారు.



డాక్టర్లు మంజూరు చేసిన వైకల్య ధ్రువపత్రం

వాల్మీకి సంఘం కోర్ కమిటీ సభ్యుడి నియామకం

పుంగనూరు : మండలంలోని బుర్రావారిపల్లెలో ఉన్న వాల్మీకి సంఘ నాయకుడు రామన్నను రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడిగా బుధవారం నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు బంగారు కృష్ణమూర్తి ఉత్తర్వులు పంపారు.

25న డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 25న రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడప్, డీఆర్‌డీఏల సంయుక్త ఆధ్వర్యంలో జాబ్‌మేళా జరుగుతుందని కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వివరాల కోసం 8465830771, 9963561755 నంబర్లకు కాల్ చేసి సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

బైక్ ర్యాలీని జయప్రదం చేయండి



మాట్లాడుతున్న నేతలు

పలమనేరు: రైతాంగ సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ఈనెల 26న పలమనేరులో నిర్వహించే బైక్ ర్యాలీని రైతులు జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు జనార్దన్ పిలుపునిచ్చారు. ఆమేరకు పలమనేరులో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతుల పండించిన పంటలకు గిట్టుబాటు ధరను అమలు చేయకుండా ప్రభుత్వాలు రైతులను నట్టేట ముంచేస్తున్నాయని ఆరోపించారు. సమస్యలపై పోరాడేందుకు బైక్ ర్యాలీ చేస్తున్నామని తెలిపారు. నేతలు ఉమాపతి పాల్గొన్నారు.

6 నుంచి బ్రహ్మోత్సవాలు

వి.కోట: పట్టణంలో వెలసిన రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 6 నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. బ్రహ్మోత్సవాల కోసం ఇప్పటికే ఆలయం వద్ద అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పూజా కార్యక్రమానికి భక్తాదులంతా హాజరై స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

వీర సైనికుడికి నివాళి



రాగిమానుపెంటలో ర్యాలీ

బంగారుపాళెం: మండలంలోని ఎగువరాగిమానుపెంటలో బుధవారం వీరజవాన్ కార్తీక్‌కు ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించారు. విద్యార్థులు ర్యాలీగా వచ్చి కార్తీక్ భౌతిక కాయాన్ని సందర్శించి, నివాళులర్పించారు.

విద్యుత్ గ్రీవెన్స్‌లో 4 సమస్యలు

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక గాంధీరోడ్డులోని ట్రాన్స్‌కో ఈఈ కార్యాలయంలో బుధవారం విద్యుత్ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 4 ఫిర్యాదులు వచ్చాయని డీఈలు ప్రసాద్, ఆనంద్ పేర్కొన్నారు. మీటర్ బాగు చేయాలని, మీటరు పేరు మార్చాలని, బిల్లు సవరణ, డిస్‌కనెక్ట్ అయిన సర్వీసును రీకనెక్ట్ చేయాలని వినియోగదారులు ఫిర్యాదులు చేశారన్నారు. వీటిని పరిశీలించి చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించినట్లు వివరించారు.

గంగమ్మా.. కరుణించు తల్లీ!



కుంటి గంగమ్మ వద్ద దీపాలు వెలిగించేందుకు వేచివున్న మహిళలు



ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్తులు

పెద్దపంజాణి: గంగమ్మా..కరుణించు తల్లీ అంటూ పెద్దకాప్పల్లి పంచాయతీకి చెందిన తిప్పిరెడ్డిపల్లి గ్రామస్తులు పూజలు చేశారు. మంగళవారం రాత్రి సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా కుంటి గంగమ్మ, బోయకొండ గంగమ్మ, కాటమరాజులకు పూజలు చేసి దీపాలు చెల్లించడం ఆనవాయితీగా వస్తోంది. ఈక్రమంలో మహిళలు భక్తి పారవశ్యాన్ని చాటుతూ ఉపవాస దీక్షలతో మేళతాళాల నడుమ దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారికి శాంతి పూజలు చేశారు. వర్షాలు బాగా కురిసి పంటలు బాగా పండాలని, జంతు సంపద వృద్ధి చెందాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ సందర్భంగా గ్రామం బంధుమిత్రులతో కిటకిటలాడింది.

అమ్మవారికి పొంగళ్లు

రామకుప్పం: మండలకేంద్రంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా బుధవారం గ్రామదేవతలకు పొంగళ్లు పెట్టారు. ఉదయం రైతు కుటుంబాలు, స్థానిక ప్రజలు డప్పుల హోరు, మంగళ వాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల నడుమ రామకుప్పం పురవీధుల్లో ఊరేగింపుగా వెళ్లి గ్రామ దేవతలకు పొంగళ్లు సమర్పించారు. కంబాలదేవులపల్లిలోని సప్తమాతృక ఆలయం, పేరూరు కుంటిగంగమ్మ, సల్లాపురెమ్మ, దిగువ వీధి గంగమ్మ, రెడ్డివీధి పెద్దపులి గంగమ్మ, చౌడేశ్వరమ్మ, మేలుపుల్లెమ్మ సల్లాపురెమ్మ, రామనగర్ గంగమ్మ, కోదండ రామనగర్ గంగమ్మ ఆలయాల్లో పూజలు నిర్వహించి పొంగళ్లు పెట్టి దీపాలు సమర్పించారు. గురువారం దేవర ఎద్దులకు పూజలు నిర్వహించి పండగ నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

కోలాహలం.. గంగజాతర



విశేష అలంకరణలో బాటగంగమ్మ

బైరెడ్డిపల్లి: మండలంలోని ఆల్లపల్లె పంచాయితీ పరిధిలోని నాచుకుప్పంలో మంగళవారం రాత్రి గంగజాతరను కోలాహలంగా నిర్వహించారు. గ్రామ పొలిమేరల్లో అమ్మవారి శిరస్సును ప్రత్యేకంగా అలంకరించి గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. బుధవారం ఉదయం ఆలయం వద్ద ప్రతిష్టించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.